# కుంటి కాకి

"కాంతం....నా జపమాల కనిపించటం లేదు. ఎక్కడ వుందో కొంచెం చూసిపెట్టు" బావి దగ్గర స్నానం ముగించుకుని తడిబట్టను జామిచెట్టుకు కట్టిన తాడుమీద ఆరేసి పట్టుబట్ట కట్టుకుని పూజామందిరం ముందు కూర్చున్న శివమూర్తి గారు గట్టిగా పిల్చారు.

"అయ్యో రామ.... మీ జపమాల కూడా నేనే వెతికి పెట్టాలండీ" అంటూ నీళ్ళు కారుతున్న తడిబట్టతో వచ్చి దేవునిపటం వెనుకనున్న జపమాలను శివమూర్తి గారి చేతిలో పెట్టి వంటగదిలోకి వెళ్ళింది కాంతం.

అన్ని స్తోత్రాలు కానిచ్చి గంట తర్వాత పూజ గదిసించి బయట పడ్డారు రిటైర్డు హెడ్మాస్టర్ శివమూర్తి గారు.

పట్టుబట్ట విప్పి ధోవతి కట్టుకుని, లాల్చి వేసుకుని మనీ పర్సు పక్క జేబులో తురుముకుంటూ కాంతాన్ని పిలిచారు.

"అబ్బ....మళ్ళీ ఏం కనిపించ లేదండీ" అంటూ విసుగులో పమిట కొంగును నడుము చుట్టూ తిప్పుకుంటూ వచ్చింది కాంతం.

"కోప్పడకు కాంతం....ఎటుతిరిగీ వంట పూర్తయ్యే సరికి ఇంకా రెండు గంటలు పడుతుంది కదా....ఈలోపు అలా బజారు వరకూ వెళ్ళి వస్తాను. బజారునించి ఏమైనా తీసుకురావాలా చెప్పు"

"ఏం అవసరం లేవులెండి" అని ఒక్క క్షణం ఆగి "అన్నట్లు మరిచిపోయాను ఈరోజు ద్వాదశి కదూ, ఒక పావలా తవలపాకులూ- ఒక అరడజను అరటిపండ్లు తీసుకురండి" చెప్పింది కాంతం.

"పూలు అవసరం లేదా? కోడలు పెట్టుకుంటుందేమో"

"ఎందుకు? పెరట్లో సన్నజాజి పందిరికి చాలా పూలున్నాయి. ఇంకేం అవసరం లేదు. మీరు త్వరగారండి. మళ్ళీ మీకోసం కనిపెట్టుకుని కూర్చోవాల్సొస్తుంది" అన్నది కాంతం వంటగదిలోకి వెడుతూ.

"అలాగే కాంతం....మన పెళ్ళయిన ముప్పైయేళ్ళలో ఏనాడైనా నీమాట దాటానా" అని నవ్వుకుంటూ వీధిలోకి నడిచారు శివమూర్తి గారు.

అలా వీధిలోకి వెళ్ళిన శివమూర్తి గారికి జడ్జీగారి ఇంటి ప్రహరీ గోడమీద కూర్చుని పెద్దగా అరుస్తున్న ఒక కాకి కనిపించింది.

"కా....కా...." అంటూ శివమూర్తి గారివైపు చూస్తూ పెద్దగా అరుస్తోంది.

అలా అరుస్తున్న కాకివైపు రెండు నిమిషాలు చూసి నాలుగడుగులు ముందుకు వేశారు. 'కా....కా....' అరుచుకుంటూ శివమూర్తి గారి తలమీదుగా పోయి హెడ్‌క్లర్క్ వెంకటాచలం గారి ఇంటిమీద వాలి అరుస్తోంది కాకి.

"ఈకాకి తనచుట్టూ ఇలా తిరుగుతున్నదేమిటి!" తనలో తనే అనుకుని ముందుకు నడక సాగించారు.

అరుచుకుంటూ శివమూర్తి గారి కంటే ముందుగాపోతూ ఆ ఇంటి మీదా ఈఇంటి మీదా వాలి అరుస్తోంది కాకి.

ఈసారి శివమూర్తి గారికి ఆశ్చర్యం వేసింది. అది తనచుట్టూ ఎందుకిలా తిరుగుతుంది? ఇదివరలో దానికి గుప్పెడు అన్నం మెతుకులు వేసిన గుర్తుకూడా లేదు. మరి తనచుట్టూ అరుస్తూ ఎందుకు తిరుగుతోంది ఈకాకి. అది శివమూర్తి గారి ఊహకుఅందని విషయమైంది.

శివమూర్తి గారితో బజారువరకూ వచ్చి ఎటువైపుకో కనిపించకుండా ఎగిరిపోయింది కాకి.



తమలపాకులు- అరటిపండ్లు తీసుకుని చుట్టూచూశారు శివమూర్తి గారు కాకికోసం. కాని అది కనిపించ లేదు.

* * *

భోజనంచేసి బావిదగ్గర చెయి కడుక్కుంటున్న శివమూర్తి గారికి కాకి అరుపు వినిపించి తల యెత్తి చూశారు.

బావి ప్రక్కగా గోడమూల వున్న జామిచెట్టు కొమ్మమీద ఒక వైపు వరగబడి కూర్చుంది కాకి. ఎడమచేత్తో పట్టుబట్టను ఎత్తిపట్టుకుని కుడిచేత్తో వెండిచెంబును పట్టుకుని చెట్టుక్రిందికి వచ్చి కాకిని పరీక్షగా చూశారు శివమూర్తి గారు. దానికి కుడికాలు లేదు. సగంవరకు మెలిక తిరిగిపోయి వుంది. 'పాపం! కుంటికాకి' అనుకున్నారాయన మనసులో.

"ఒరేయ్ వాసూ" చెంబును గుమ్మందగ్గర వుంచుతూ పిలిచారు శివమూర్తి గారు.

"ఏమిటి తాతయ్యా" నడవాలోనించి పరుగెత్తుకుంటూ వచ్చాడు అయిదేండ్ల వాసు.

"మీనాన్నను పడక్కుర్చీ తెచ్చి జామిచెట్టుక్రింద వెయ్యమను."

వాసు మళ్ళీ పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు. వాసు తండ్రి కుర్చీ తెచ్చాడు.

"పరమేశ్వరా" అంటూ కుర్చీలో వాలిపోయి పైకి చూశారు శివమూర్తి గారు. కాకి శివమూర్తి గారివైపే చూస్తుంది. దానిని చూస్తుంటే ఆయనకు ఎందుకో తగని జాలివేసింది. మనసు నిలువక "వర్ధనీ.... వర్ధనీ" అంటూ పిలిచారు.

మామగారి పిలుపు వినిపించి వంటింట్లో ఎంగిళ్ళు ఎత్తుతున్న వర్ధని "ఏమిటి మామయ్య గారూ" అంటూ వచ్చింది.

"ప్లేటులో గుప్పెడు మెతుకులు వేసుకొచ్చి ఆ గోడమీదపెట్టు."

శివమూర్తి గారి మనస్తత్వం కోడలు వర్ధనికి బాగా తెలుసు. అందుకే ఎందుకని ఎదురు ప్రశ్నలు వెయ్యకుండా వంటింట్లోకి వెళ్ళి చిన్న పళ్ళెంలో అన్నం మెతుకులను వేసుకొచ్చి గోడమీద పెట్టి వెళ్ళిపోయింది.

జామిచెట్టు మీదనుంచి ఎగురుకుంటూ వచ్చి గోడమీద పళ్ళెంలోని మెతుకులను గబగబా తినసాగింది.

ఆ దృశ్యం చూస్తుంటే శివమూర్తి గారు తానేదో ఘనకార్యం చేసినట్లు ఫీలయ్యారు. మనసంతా సంతోషంతో నిండిపోయింది.

మెతుకులు తిన్న తర్వాత బావిదగ్గర గుంటలో నిల్చిన నీటిని త్రాగి మళ్ళీ జామిచెట్టు మీదకు వచ్చింది కాకి.

కుర్చీలో వెనక్కువాలి కాకినే దీక్షగా చూస్తున్న శివమూర్తి గారి మనసులో ఎన్నో ఆలోచన్లు దొర్లిపోతున్నాయి.

'చనిపోయిన తర్వాత పితృదేవతలు కాకిరూపం ధరిస్తారంటారు. అది నిజమేనేమో! అందుకే తద్దినం పెట్టేరోజు కాకికి పిండంవేస్తారు. పితృదేవతలు ఆరూపంలో వచ్చి తిని పోతారంటారు.' ఈ ఆలోచన రాగానే ఆయన మనసులో ఆయన తండ్రి రంగనాధంగారు మెదిలారు. రంగనాధం గారికి శివమూర్తి గారంటే ఎంతో ఇష్టం. శివమూర్తి గారు ఒక్కరే సంతానం. అందుకే గారాబంగా పెంచారు. ఒకవేళ తన తండ్రే కాకి రూపంలో వచ్చాడేమో, అనిపించింది శివమూర్తి గారికి.

ఈ ఊహ ఆయన మదిలో మెదిలిన తర్వాత కుంటికాకి మీద శివమూర్తి గారికి పూజ్యభావం కలిగింది. కాకిని చూస్తుంటే తనతండ్రే ఎదురుగా వున్నట్టు తృప్తి చెందారు.

ఇలా కాకి గురించి ఆలోచిస్తూనే ఆయన ఎప్పటికో నిద్రలోకి జారిపోయారు.

ఎంతవరకు నిద్రపోయారో! ఏమో! "తాతయ్యా....తాతయ్యా" వాసు పిలుపుతో కళ్ళు తెరిచి చూశారు శివమూర్తి గారు.

ఎదురుగా వాసు ఉప్మా ప్లేటులో నిలుచుని వున్నాడు.

చిన్నగా నవ్వి వాసు చేతిలోని ఉప్మాప్లేటు అందుకుని జామి చెట్టు పైకిచూశారు. కాకి కనిపించలేదు. 'ఎక్కడికి ఎగిరిపోయిందో' అనుకుని ఉప్మా తిని, కాఫీతాగి బావిదగ్గర ముఖం కడుక్కుని ఉతికిన ధోవతి కట్టుకుని, లాల్చీ వేసుకుని ఉత్తరీయాన్ని భుజంమీద వేసు కుంటూ పార్కు వరకు వెళ్ళివద్దామని బయల్దేరారు శివమూర్తిగారు. ఆయనకు ప్రతిరోజూ పార్కుకువెళ్ళి తన స్నేహితులతో ముచ్చటలాడి చీకటిపడిన తర్వాత గూటికి చేరుకోవటం అలవాటు.

వీధిలోకి వచ్చి జడ్జీగారి ఇంటివైపు చూచారు.

కాకి కనిపించలేదు.

ప్లీడరుగారి మామిడి చెట్టుమీద నుంచి కాకి అరుపు వినిపించింది. తలను అటుకేసి తిప్పారు. అది కుంటికాకి కాదు. మరో కాకి గొంతు బొంగురు పోయినట్లుగా అరుస్తోంది.

కొంతదూరం వెళ్ళాక కుంటికాకి ఎక్కడినుంచో ఎగురుకుంటూ వచ్చింది. శివమూర్తిగారి గుబురుగా పెరిగిన మీసాల మధ్య చిరుమంద హాసం వెల్లివిరిసింది. ఆయన కనులలో కాంతిరేకలు. 'నువ్వు వస్తావని నాకు తెలుసు' అన్నట్లున్నాయి ఆయన చూపులు.

ఆయనతో పార్కువరకూవచ్చి మళ్ళీఎటో ఎగిరిపోయింది కాకి.

చీకటి పడిందాకా పార్కులో కూర్చుని ఇంటికి బయల్దేరారు శివమూర్తిగారు.

ఆయన ఇంటికి వచ్చేసరికి వాసు వరండాలో లైటుక్రింద కూర్చుని కాకి పాఠం చదువుతున్నాడు.

లాల్చీవిప్పి, వంకీకి తగిలించి, ఉత్తరీయాన్ని దండెం మీదవేసి కుర్చీలో వాలిపోయారు.

"తాతయ్యా...కాకికథ చెప్పవూ" వాసు ఒకటవ తరగతి పుస్తకం తీసుకొచ్చాడు. వాసుని ఒడిలో కూర్చోపెట్టుకుని పుస్తకం చేతిలోకి తీసుకున్నారు.

"ఒరేయ్ వాసూ!! ఒకసారి ఒక కాకికి బలే దాహమయిందిరా.... దానికి ఎక్కడా మంచినీళ్ళు దొరకలేదు. వెతగ్గా, వెతగ్గా ఒకచోట కడవలో అడుగున ఎక్కడో నీళ్ళు కనిపించాయి. అంత అడుగున వున్న నీటిని ఎట్లా తాగాలో కాకికి తెలీలేదు. అందుకని అదొక ఉపాయం ఆలోచించింది. ఎక్కడికో ఎగురుకుంటూ వెళ్ళి చాలా గులక రాళ్ళు తీసుకొచ్చి కడవలో వేసింది. అప్పుడు అడుగునవున్న నీళ్ళన్నీ పైకి వచ్చేశాయి అది హాయిగా నీళ్ళు తాగి దప్పిక తీర్చుకుని ఎగిరి చక్కాపోయింది. చూశావా? కాకి ఎంత తెలివైన పక్షో?" శివమూర్తి గారు వాసు ముఖంలోకి చూస్తూ అన్నారు.

అవునన్నట్లు తలాడించాడు వాసు.

"కాళ్ళు కడుక్కురండి. భోజనం వడ్డిస్తాను" వంటింట్లో నించి కేకేసింది కాంతం.

భార్య పిలుపు వినిన శివమూర్తి గారు "లేవరా వాసూ....మీ బామ్మ భోజనానికి పిలుస్తుంది" అంటూ లేచి బావి దగ్గరకువెళ్ళి కాళ్ళు కడుక్కుంటూ జామిచెట్టు పైకిచూశారు. కొమ్మమధ్య వొదిగికూర్చుంది కుంటికాకి.

ముసిముసిగా నవ్వుకుంటూ వెళ్ళి భోజనానికి కూర్చున్నారు.

భోజనమైన తర్వాత చిన్న గిన్నెలో అన్నం మెతుకులు వేసుకుని వచ్చి బావిబొడ్డు మీద వుంచారు అదిచూసి కాకి ఎగురుకుంటూ

వచ్చి మెతుకులను తిని వెళ్ళిపోయి మళ్ళీ జామిచెట్టుమీద కూర్చుంది

శివమూర్తిగారు తృప్తిగా నవ్వుకున్నారు. ఆయనే ప్రతిరోజూ కాకికి అన్నం వేస్తున్నారు. మరెవరు దానికి అన్నం పెట్టినా తృప్తిగా వుండదు ఆయనకు. తన స్వహస్తాలతో దానికి గిన్నెలో అన్నం పెడి తేనే ఆయనకు తృప్తి.

* * *

పదిరోజుల తర్వాత ఉన్నట్టుండి కుంటికాకి కనిపించకుండా హఠాత్తుగా మాయమయింది. శివమూర్తిగారు 'మొదట ఎక్కడికో పోయింది. భోజనం వేళకు అదే వస్తుందిలే' అనుకున్నారు. కాని అది మళ్ళీ తిరిగిరాలేదు. ఆరోజు శివమూర్తిగారికి ఏమీ తోచలేదు. భోజనం చెయ్యబుద్ధి కాలేదు. వాసుని వెంట వేసుకుని వీధులన్నీ తిరిగారు. ఏ చెట్టుమీద, ఏఇంటి ప్రహరీ గోడమీద కాకి కనిపించినా కుంటికాకేనని భ్రమించారు. ఆయన ఎంత తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. కుంటికాకి ఎక్కడా కనిపించలేదు. ఆయన మనసును దిగులుపట్టుకుంది. అన్నం ముట్టడం మానేశారు. జామిచెట్టు క్రింద కుర్చీ వేసుకుని విచారంగా కాకిని గురించే గంటల తరబడి ఆలోచించడం మొదలుపెట్టారు. భోజనం చెయ్యమని కాంతం ఎంతగానో బ్రతిమిలాడింది. "వెధవకాకి కోసం దిగులుపడతారా?" అన్నది. కాంతం ఎన్ని విధాలుగా చెప్పినా శివమూర్తిగారు తన పట్టు విడువలేదు. కాకి తిరిగి వచ్చిన తర్వాతనే తను మెతుకు కొరుకుతానన్నారు.

వారం రోజులు గడిచాయి.

శివమూర్తిగారు చిక్కి సగమయ్యారు. అనుక్షణం ఆయన కనుల ముందు కుంటి రూపం, చెవులకు దాని అరుపే మెదలుతున్నాయి.

వారంరోజుల తర్వాత ఒకరోజు తెల్లావారేసరికి కుంటికాకి మళ్ళీ జామిచెట్టు మీద ప్రత్యక్షమయింది. శివమూర్తి గారికి ప్రాణంలేచి వచ్చినట్లయింది. ఆయన ముఖం దేదీవ్యమానంగా కాంతితో నిండి పోయింది. కాని దాని అరుపు విన్న తర్వాత, దాని రూపు దీక్షగా చూసిన తర్వాత ఆయనకు దుఃఖం ఆగలేదు.

దాని అరుపులో ఇదివరకున్న ఉత్సాహం లేదు. చిన్నగా, నీర సంగా, బలహీనంగా అరుస్తోంది. ఈకలన్నీ చాలా వరకు వూడి పోయాయి. బోసిపోయినట్లుగా వుంది దాని రూపు. ఆ కాకిని చూస్తుంటే ఆయన హృదయాన్ని ఏదో బాధ మెలిపెట్టి నట్లనిపించింది.

ఆరోజు ఉదయం శివమూర్తిగారు కాకికి అన్నం మెతుకులు వేస్తే- అది ముట్టకుండా వెళ్ళిపోయింది. దానికేద్ద నా రోగం వచ్చిం దేమో అనుకున్నారు. తగ్గిన తర్వాత తింటుందేమో అనుకున్నారు.

"రేపు శ్రావణ శుక్రవారం. కోడలు నోము నోచుకుంటుంది. కావలసిన సరుకులు తీసుకురండి" ఆ సాయంత్రం శివమూర్తి గారితో చెప్పింది కాంతం.

శివమూర్తిగారు బజారుకు బయల్దేరారు.

కుంటికాకి ఆయన వెనుకే బజారుకు బయల్దేరలేదు. జామిచెట్టు మీద చలికి వణికిపోతున్న దానిలా కూర్చుంది.

కావలసిన సరుకులు తీసుకుని సంధ్య క్రమంగా వెళ్ళబోతున్న వేళ బజారునించి తిరిగి వచ్చారు శివమూర్తిగారు.

శివమూర్తి గారిని దూరంనించే చూసిన వాసు పరిగెత్తుకుంటూ ఆయనకు ఎదురుగావెళ్ళి "తాతయ్యా....తాతయ్యా....కుంటికాకి చచ్చి పోయింది" అని చెప్పాడు.

"మన కుంటికాకా !" నమ్మలేనట్లుగా ఆశ్చర్యంగా అడిగారు ఆయన.

"అవును తాతయ్యా ! మన కుంటికాకే. ఇంతకుముందు నేల మీదపడి గిలగిలా కొట్టుకుని చచ్చిపోయింది. అరుగో ! పిల్లలందరూ చూస్తున్నారు."

శివమూర్తి గారి శరీరం కంపించి పోయింది. వడివడిగా నడిచి ఇంటిముందుకు వచ్చారు. సైడుకాలువ ప్రక్కనే కాకి చచ్చిపోయింది. దానిచుట్టూ పిల్లలు గుంపుగా నిలుచుని చూస్తున్నారు.

ఎక్కువసేపు అక్కడ నిల్చుని ఆ దృశ్యాన్ని చూడలేక ఇంట్లోకి వెళ్ళిపోయారు శివమూర్తి గారు. ఆయన కడుపు తరుక్కుపోతోంది. దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవాహంలా పొంగివచ్చింది. తన తండ్రిని పోగొట్టుకున్నట్టుగా బాధపడుతున్నారు ఆయన. ఇన్ని రోజులనించీ తనచుట్టూ తిరిగిన కాకి— తన చేతితో పెట్టిన మెతుకులు తిన్న కాకి— ఈరోజు నించీ ఇకలేదు.

ఇన్నాళ్ళూ తన తండ్రితో సమానంగా భావిస్తున్న కాకి ఈరోజు చచ్చిపోయింది. శివమూర్తి గారు శోక సముద్రంలో మునిగిపోయారు.

అంత దుఃఖంలోనూ ఆయన మస్తిష్కంలో ఒక ఆలోచన మెదిలింది. కాకికి దహన క్రియలు జరపాలి. తన తండ్రే ఆ రూపంలో వచ్చాడు. తన తండ్రిపోతే దహన క్రియలు జరపలా ??

"కాంతం....కాంతం....ఇలారా" దుఃఖంతో పూడుకుపోయిన గొంతుతో పిల్చారు శివమూర్తి గారు.

"ఏమిటండీ....అవతల కూర మాడిపోతుంటే మీ కేకలు" విసుక్కుంటూ వచ్చింది కాంతం.

"మనకాకి చచ్చిపోయిందిగా....దానికి దహన క్రియలు జరుపు దామనుకుంటున్నాను" చెప్పారు శివమూర్తి గారు.

"హవ్వ...." అని ముక్కుమీద వేలేసుకుని "మీకు యేళ్ళు వస్తున్నకొద్దీ మతి పూర్తిగా పోతుంది. పక్షులకు మనుషులు దహన క్రియలు జరపటం ఎక్కడైనా వుందా ?! ఎవరైనా వింటే నవ్విపోతారు. అరవకుండా కూర్చోండి. ఏ కుక్కలో దానిని తినేస్తాయిలే" విసురుగా లోపలకు వెళ్ళిపోయింది కాంతం.

కాంతం మీద పట్టరానికోపం వచ్చింది శివమూర్తి గారికి.

'రామాయణంలో జటాయువు చచ్చిపోతే రామలక్ష్మణులు దానికి దహన క్రియలు జరుపలేదూ ? జటాయువు పక్షికాదా ?' ఎట్లాగయినా కాకికి దహనక్రియలు జరపాలని నిశ్చయించుకున్నారు శివమూర్తిగారు.

ఆరాత్రి ఆయన భోజనం చెయ్యలేదు. మిగతా వారందరూ భోజనాలు చేసి పక్కలు పరుచుని నిద్రపోయారు. శివమూర్తి గారికి నిద్రపట్టలేదు. కడుపులో ఆకలి మండిపోతోంది. ఆవేదనా భారంతో గుండె మండిపోతోంది.

గోడ గడియారం ఒంటిగంట కొట్టింది.

ఉలిక్కిపడినట్లు లేచి కూర్చున్నారు శివమూర్తి గారు. అంతా నిద్రాదేవి ఒడిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. మెల్లగా లేచి వీధితలుపు దగ్గరకు వచ్చి చప్పుడు కాకుండా తెరిచి బయటకు వచ్చారు. వీధిలైటు కాంతి కాలువ ప్రక్కనేవున్న కుంటికాకి మీద పడుతోంది. ఇంతవరకూ దానిని ఏ కుక్కలో తినివెయ్యకుండా వుంచినందుకు సంతోషమనిపించింది. మెల్లిగా దాని దగ్గరకు వెళ్ళి వణుకుతున్న చేతులతో దానిని పట్టుకుని ఇంట్లోకివచ్చి తలుపుకు గడియపెట్టి దొడ్డితలుపు తెరిచి జామి చెట్టు క్రిందికి వచ్చారు.

చెట్టుక్రింద దానిని పడుకోబెట్టి స్నానాల గదిలోనించి కట్టె పుల్లలు, చిన్నచిన్న చితుకులు, కిరసనాయిలు సీసా తీసుకువచ్చారు. క్షణంలో కట్టెపుల్లలన్నీ మండాయి. కాకిని ఆ మంటలో వుంచి దాని పైన మరికొన్ని పుల్లలను పేర్చారు. కుంటికాకి శరీరం మంటల్లో దహనమవుతూంది.

మనుషులను మనుషులు ప్రేమించటం, వారి మీద ఆత్మీయత పెంచుకోవటం సహజం. కాని- నోరులేని జంతువులను ప్రేమించటం, వాటిపై మమకారాన్ని, ఆత్మీయతను పెంచుకోవటం చాలా అరుదు. ఒక్కొక్కసారి ఏదయినా పక్షిని చూస్తే దానిమీద ఎందుకో సదభిప్రాయం ఏర్పడుతుంది. ఆపక్షి మనకు సన్నిహితంగా వస్తే దానిమీద ఆప్యాయత పెరుగుతుంది. ఆప్యాయత పెరుగుతున్నకొద్ది ఆ పక్షితో మనకు ఏదో కనపడని బంధం పెనవేసుకు పోతుంది. ఉన్నట్లుండి ఆ బంధం తెగిపోతే- ఆ గుండెలో మిగిలేది శోకమే.

శివమూర్తిగారి మనసులో ఎన్నో ఆలోచనలు దొర్లిపోతున్నాయి. తన తండ్రిపోయిన రోజుకూడా ఇంతే. తను మరోసారి తండ్రిని పోగొట్టుకున్నట్లు బాధపడుతున్నారు. ఒకవైపు కాకి మంటల్లో కాలి పోతున్నందుకు ఆయన హృదయం దహించుకు పోతున్నది. కుక్కల వాత పడకుండా కాకిని పవిత్రంగా దహనం చేస్తున్నందుకు ఆయనకు ఎంతో తృప్తి అనిపించింది.

నిద్ర మెలకువచ్చి లేచిచూస్తే కాంతకు కుర్చీలో శివమూర్తిగారు కనిపించలేదు. దొడ్డి తలుపు దగ్గరకు వేసి వుండటం కనిపించింది. దొడ్లో ఏదో కాలుతున్న వాసన.

మంచం మీదనించి క్రిందికిదిగి గుమ్మంవైపు నడిచింది కాంతం.

దొడ్డితలుపు తీసిన కాంతంకు జామిచెట్టుక్రింద గొంతుక్కూర్చుని, తదేకంగా మంటనుచూస్తూ తృప్తిగా కన్నీళ్ళను కారుస్తున్న శివమూర్తి గారు మంట వెలుగులో కనిపించారు.

ఆ దృశ్యం చూసిన కాంతం కనుల వెంబడి రెండు కన్నీటి చుక్కలు రాలాయి.

*

(1974 ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీల్లో బహుమతి పొందిన కథ).